RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 255 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం మంగళవారం, 19 మార్చి 2024 పేజీలు : 4 వెల : 2/-

# వేడెక్కిన రాజకీయం

## అప్రమత్తమైన రాజకీయ పార్టీలు




## గెలుపుపై ఎవరి ధీమా వారిదే!

మేడ్చల్ జిల్లా: పార్లమెంటు ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయం వేడెక్కింది. పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తెచ్చి మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంపై జెండా ఎగురవేసేందుకు మూడు ప్రధాన పార్టీలు పోటీపడుతున్నాయి. దేశంలోనే అతి పెద్ద లోక్‌సభ నియోజకవర్గంగా గుర్తింపు పొందిన మల్కాజిగిరి స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి.

**మూడు జిల్లాలు.. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు** : నగరంతోపాటు శివారు జిల్లాలైన మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను కలిగి ఉన్న మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ స్థానంలో ఇప్పటికే భారతీయ జనతా పార్టీ(బీజేపీ), భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)అభ్యర్థులను ప్రకటించగా... కాంగ్రెస్ గెలుపు గుర్రం కోసం అన్వేషిస్తోంది. శాసనసభ ఎన్నికల తర్వాత రాష్ట్రంతో పాటు నగర శివారు జిల్లాల్లోనూ రాజకీయ సమీకరణాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తుండటంతో ఓటర్ల ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న మల్కాజిగిరి ఎంపీ పరిధిలో ప్రస్తుతానికి 37,28,519 ఓటర్లు ఉన్నారు. ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 6,58,190 మంది ఓటర్లు ఉండగా, మల్కాజిగిరిలో 4,99,538, కుత్బుల్లాపూర్‌లో 7,12,756, కూకట్‌పల్లిలో4,71,878, ఉప్పల్‌లో 5,33,544, ఎల్బీనగర్‌లో 6,00,552, కంటోన్మెంట్‌లో 2,52,060 మంది ఓటర్లు ఉన్నారు. ఎంపీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు వరకు కూడా అర్హులైన వారు కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

**పార్టీలు అప్రమత్తం** : మల్కాజిగిరి నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారు కావటంతో ... కాంగ్రెస్ వైఖరి ఎలా ఉంటుందనే దానిపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. బీజేపీ నుంచి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ తరఫున రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాలను ఆయా పార్టీలు ప్రకటించటంతో వారు ప్రచారంలోకి దిగారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రచార పర్వంలో ముందున్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించిన ఆయన బస్తీలు ,పురపాలక సంఘాలు ,డివిజన్లు, గ్రామాల వారీగా ఎన్నికల ప్రచారంపై దృష్టి సారించారు. ఈటల విజయం కోసం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజవర్గ పరిధిలో పార్టీ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో పాల్గొని ఎన్నికల శంఖారాన్ని పూరించగా, శుక్రవారం భారత ప్రధాని మోదీ మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో రోడ్ షో కార్యక్రమాన్ని చేపట్టి బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపారు. కాంగ్రెస్ టికెట్ కోసం పోటీ నెలకొనడంతో అభ్యర్థుల ఎంపిక కీలకంగా మారింది. కాంగ్రెస్ అధిష్టానం తాజాగా పట్నం సునీతా మహేందర్ రెడ్డి పేరు పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఆమె పేరును అధికారికంగా నేడో ,రేపో ప్రకటించవచ్చునని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**బీజేపీలో అసమ్మతిపై దృష్టి** : బీజేపీలో టికెట్ కోసం చివరి నిమిషం వరకు ప్రయత్నించిన కొందరు నేతలు పార్టీపై అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. టికెట్ ఆశించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అర్బన్ అధ్యక్షుడు పి.హరీష్ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు.

ఈ నేపథ్యంలోనే పార్టీ పెద్దలు అసంతృప్తి నేతలను బుజ్జగించటంతో పాటు అభ్యర్థి ఈటల గెలుపు కోసం పని చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో బీఆర్ఎస్ ఆడుకుంది: ప్రధాని మోదీ



జగిత్యాల: తెలంగాణ ప్రజలు కొత్త చరిత్ర సృష్టించబోతున్నారు. ఎన్నికల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పని అయిపోతుందన్నారు ప్రధాని మోదీ. తెలంగాణలో బీజేపీ క్రమంగా బలపడుతోందని చెప్పుకొచ్చారు ప్రధాని నరేంద్ర మోదీ. కాగా, జగిత్యాలలో బీజేపీ విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ..'మే 13న తెలంగాణ ప్రజలు కొత్త చరిత్ర సృష్టించబోతున్నారు. వికసిత్ భారత్ కోసం తెలంగాణ ప్రజలు ఓటు వేయబోతున్నారు. తెలంగాణలో బీజేపీ క్రమంగా బలపడుతోంది. మాల్కాజ్‌గిరిలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తెలంగాణ ప్రజలు అబ్ కీ బార్.. 400 పార్ అంటున్నారు. మొన్ననే లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. గడిచిన మూడు రోజుల్లో రెండు సార్లు తెలంగాణకు వచ్చాను. దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం. భారత్ అభివృద్ధి చెందితే తెలంగాణలో కూడా అభివృద్ధి జరుగుతుంది. బీఆర్ఎస్‌పై ప్రజలకు ఉన్న ఆగ్రహం అసెంబ్లీ ఎన్నికల్లో బయటపడింది. తెలంగాణను దోచుకున్న వాళ్లను మేము వదిలిపెట్టం. మాకు అధికారం కంటే ప్రజా సంక్షేమం ముఖ్యం. తెలంగాణలో ఎన్నో వేల కోట్ల రూపాయాలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. తెలంగాణలో బీజేపీ అధికారంలో ఉంటే.. రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేది. తెలంగాణలో బీజేపీకి ఎన్ని సీట్లు ఎక్కువ వస్తే.. నాకు అంత శక్తి వస్తుంది. పసుపు రైతులను బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకోలేదు. బీజేపీ ప్రభుత్వం పసుపు రైతులకు ఎంతో మేలు చేసింది. ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ పని అయిపోతుంది. పదేళ్లపాటు బీఆర్ఎస్ తెలంగాణను దోచుకుంది. తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో బీఆర్ఎస్ ఆడుకుంటోంది. ఇప్పుడు కాంగ్రెస్.. తెలంగాణను ఏటీఎంలా మార్చుకుంటోంది. బీఆర్ఎస్‌పై అవినీతి ఆరోపణలు చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆ ఫైల్స్‌ను పక్కన పెడుతోంది. కాళేశ్వరం అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మకయ్యాయి. లిక్కర్ స్కామ్‌లోనూ బీఆర్ఎస్ కమీషన్లు తీసుకుంది. బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ దర్యాప్తు చేయడం లేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు నన్ను దూషించడమే పనిగా పెట్టుకున్నాయి. కాళేశ్వరంలో బీఆర్ఎస్ అవినీతికి పాల్పడింది. ఇక్కడ దోచిన డబ్బును కుట్రలకు వాడుతున్నారు. తెలంగాణ నుంచి డబ్బులు ఢిల్లీలో కుటుంబ పార్టీ పెద్దలకు వెళ్తున్నాయి. దేశంలో జరిగిన స్కామ్‌లన్నింటికీ కుటుంబ పార్టీలే కారణం. శివాజీ మైదానంలో రాహుల్ గాంధీ.. తన పోరాటం శక్తికి వ్యతిరేకం అని చెప్పారు. శక్తిని వినాశనం చేసేవాళ్లకు.. శక్తికి పూజ చేసే వాళ్లకు మధ్య పోరాటం జరగబోతుంది. నాకు ప్రతీ మహిళా.. ఒక శక్తి స్వరూపంలా కనిపిస్తుంది. శక్తిని ఖతమ్ చేస్తామన్న రాహుల్ గాంధీ ఛాలెంజ్‌ను నేను స్వీకరిస్తున్నాను. చంద్రయాన్ విజయవంతమైన ప్రాంతానికి కూడా శివశక్తి అని పేరు పెట్టాను. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో.. జూన్ నాలుగో తేదీన తెలుస్తుంది. నేను భారతమాతకు పూజారిని' అంటూ కామెంట్స్ చేశారు.




హైదరాబాద్: తెలంగాణ గవర్నర్ పదవికి తమిళిసై రాజీనామా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకే ఆమె పదవి వీడినట్లు సమాచారం. 2019 సెప్టెంబర్ 8న ఆమె తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తించారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తమిళనాడు నుంచి భాజపా తరఫున ఆమె బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గవర్నర్ పదవి చేపట్టకముందు తమిళనాడు భాజపా అధ్యక్షురాలిగా ఆమె వ్యవహరించిన విషయం తెలిసిందే. 2019లో తెలంగాణ రాష్ట్రానికి తమిళిసై గవర్నర్‌గా వచ్చారు. తెలంగాణ రాష్ట్రానికి తొలి మహిళా గవర్నర్ తమిళిసై కావడం విశేషం. మూడేళ్లకు పైగా తెలంగాణలో గవర్నర్ గా విధులు నిర్వర్తించారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ (%ఖజ=%)తో నువ్వా నేనా అన్నట్లుగా వ్యవహరించారు. గవర్నర్‌గా ఉండి రాజ్‌భవన్(%ఘుయిఎష్ట్రుుఝుఅ%) లో ప్రజాదర్బార్ నిర్వహించిన ఘనత కూడా తమిళిసైదే. రాజ్‌భవన్ ముందు ఫిర్యాదు బాక్స్ పెట్టిన తొలి గవర్నర్‌గా ప్రసిద్ధి చెందారు. గిరిజన విద్యార్థులకు అండగా నిలిచారు. తమిళనాడు లోక్‌సభ ఎన్నికల్లో ఆమె పోటీ చేయనున్నారని సమాచారం. చెన్నై సౌత్, తిరునల్వేలి, కన్యాకుమారిలో.. ఏదో ఒకచోట పోటీ చేసే యోచనలో ఉన్నారు. నాడార్ సామాజిక వర్గానికి చెందిన తమిళిసై తిరునల్వేలి, కన్యాకుమారి నుంచి పోటీ చేస్తారని కూడా టాక్ నడుస్తోంది. దీనికి కారణం అక్కడ సొంత సామాజికవర్గం ఎక్కువగా ఉండటమే.




హైదరాబాద్ : గడిచిన కొంతకాలంగా ముఖ్యమంత్రి రేవంత్ నోటి నుంచి వస్తున్న మాటలు ఈ రోజు వాస్తవంగా మారాయి. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నాటి నుంచి తమ సర్కారును కూల్చేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారంటూ తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ తీవ్ర ఆరోపణలు చేయటం తెలిసిందే. తమ ప్రభుత్వాన్ని కూల్చాలని భావిస్తే.. తానేమిటో చూపిస్తానంటూ హెచ్చరికలు జారీ చేశారు. తమ ప్రభుత్వం కూలిపోవటం లేదని.. తాను గేట్లు తెరవాలే కానీ.. గులాబీ కారు మొత్తం ఖాళీ అయిపోవటానికి సిద్ధంగా ఉందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్..ఆయన కుటుంబ సభ్యులు.. ఒకరిద్దరు మినహా ఆ పార్టీలో మరెవరూ ఉండరంటూ వ్యాఖ్యలు చేస్తున్న రేవంత్ మాటలకు తగ్గట్లే.. పరిస్థితులు ఉన్నాయా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ఇదిలా ఉంటే.. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాతి రోజునే మాజీ మంత్రి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. గులాబీ పార్టీకి చెందిన చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# దటీజ్ రేవంత్

## కాంగ్రెస్ గూటికి 'క్యూ'

### రంజిత్.. దానం చేరిపోయారు.. తర్వాత లిస్టులో ఉన్నదెవరు?

దీంతో.. కాంగ్రెస్ పార్టీలోకి గులాబీ దండు రాక మొదలైనట్లుగా చెబుతున్నారు. లోక్ సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్ ను ఖాళీ చేయటమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతున్నట్లుగా అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్.. తాము గేట్లు ఎత్తేసినట్లుగా పేర్కొన్నారు. దీంతో.. భారీ ఎత్తున వలసలు షురూ అయినట్లేనని చెప్పక తప్పదు. గ్రేటర్ పరిధిలో ఒక్కరంటే ఒక్క ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్ లో లేకపోవటం.. తాజాగా దానం కాంగ్రెస్ లో చేరటంతో గ్రేటర్ లో బోణీ కొట్టినట్లుగా చెబుతున్నారు.

విశ్వసనీయ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. రానున్న కొద్ది రోజుల్లో గ్రేటర్ పరిధిలోని దాదాపు ఐదారుగురు వరకు గులాబీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరటం ఖాయమంటున్నారు. మొత్తంగా లోక్ సభ ఎన్నికల నాటికి.. గులాబీ పార్టీ నుంచి దాదాపు డజను నుంచి ఇరవై వరకు ఎమ్మెల్యేల రాక కాంగ్రెస్ లోకి ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరేం జరుగుతుందో చూడాలి.


## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

### సిఏఏ విషయంలో కేంద్రం ఎందుకు అంత పట్టుదలగా ఉంది?

సీఏఏ (సిటిజన్ షిప్ అమండ్ మెంట్ ఆక్ట్ )ను కచ్చితంగా అమలు చేసి తీరుతామని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. సీఏఏ అమలుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎవరి కోసం ఉద్దేశంచిన చట్టం కాదని శరణు కోరి వచ్చిన వారికి పౌరసత్వం అందివ్వడం మన కర్తవ్యం. అది రాజ్యాంగంలోనే ఉంది. రాజ్యాంగ విలువలను కాపాడే ప్రయత్నంలో భాగంగానే ఈ చట్టం తీసుకొచ్చాం. దీని అమలులో ఎన్ని కష్టాలు ఎదురైనా వెనకడుగు వేసేది లేదన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు తనదైన శైలిలో సమాధానాలు ఇచ్చారు. ఈ చట్టం ఎందుకు తెచ్చామో వివరణ ఇచ్చాం. ఎందుకు వద్దంటున్నారో రాహుల్ గాంధీ కూడా వివరణ ఇవ్వాలి. సీఏఏ అమలు విషయంలో తగ్గేది లేదన్నారు. జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అమిత్ షా తన మనసులోని మాటలను వెల్లడించారు. సీఏఏపై చాలా సమావేశాల్లో మాట్లాడాను. చట్టం ఇప్పటిది కాదు. కోవిడ్ కంటే ముందే తీసుకొచ్చాం. కానీ దాని అమలు ఆలస్యమైంది. ఎన్నికల కోసమే దీన్ని తీసుకొచ్చామని చెప్పడం సమంజసం కాదు. ప్రతిపక్షాలు ప్రతిదాన్ని రాజకీయ కోణంలో చూస్తూ పనికొచ్చే చట్టాలను సైతం తప్పుబట్టడం కొత్తేమీ కాదు. కానీ తాము మాత్రం సీఏఏ అమలులో తాత్సారం చేయబోమని తేల్చారు. 370 ఆర్టికల్ రద్దు గురించి కూడా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేశాయి. కానీ ఇప్పుడు దాని అమలుతో జమ్ము కాశ్మీర్ సుభిక్షంగా మారడం చూసి ఆశ్చర్యపోతున్నారు. సీఏఏ విషయంలో కూడా అదే జరుగుతుందని అమిత్ షా నమ్ముతున్నారు. దీని కోసమే తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. పలు రాష్ట్రాలు దీని గురించి కామెంట్ చేయడం తప్పుబట్టారు. వారికి అవగాహన లేకే అలా మాట్లాడుతున్నారన్నారు. సీఏఏ చట్టం అమలుపై ఆందోళనలు పెరిగితే పునరాలోచిస్తారా? అనే ప్రశ్నకు చట్టాన్ని వెనక్కి తీసుకోబోమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని ఉపసంహరిస్తామని చెప్పడం వారి అనైతికతకు నిదర్శనం. మోదీ సర్కారు తీసుకొచ్చిన చట్టం రద్దు చేయడం అసాధ్యమన్నారు. పాకిస్తాన్, అఫ్గనిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల్లోని ముస్లిమేతరుల కోసం ఉద్దేశించింది ఈ చట్టం. ఇందులో ఎలాంటి లోపాలు లేవు. సక్రమంగా అమలు చేయడం మా బాధ్యత.

# సర్వే నంబర్లు జోడించారు.. సర్కారు స్థలం పట్టేశారు



హైదరాబాద్ : హైదరాబాద్-పాతముంబయి రహదారి విస్తరణకు భూములిచ్చామంటూ కొందరు ప్రైవేటు వ్యక్తులు సర్వే నంబర్లు.. బాధితుల పేర్లు జోడించి ఖాజాగూడలో మూడు ఎకరాల సర్కారు స్థలాన్ని 22 ఏళ్ల క్రితం సొంతం చేసుకున్నారు.. ప్రస్తుతం ఈ భూముల విలువ రూ.180కోట్లు ఉంటుంది. అప్పట్లో చేవెళ్ల రెవెన్యూ డివిజన్ అధికారి తమకు ఇచ్చారంటూ తప్పుడు పత్రాలు సృష్టించారు. చేవెళ్ల రెవెన్యూ డివిజన్ స్థానంలో రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ ప్రారంభమైనప్పుడు వీరి పేర్లు లేవు. పాత రికార్డుల్లో మా పేర్లు ఉన్నాయంటూ రిజిస్ట్రేషన్లు చేయించుకుని, జీహెచ్ఎంసీ ద్వారా అనుమతులు తీసుకున్నామంటూ వాటిని 100, 200, 300 గజాల చొప్పున విక్రయిస్తున్నారు. కొనుగోలు చేసిన వారు ఇళ్లు, అపార్ట్‌మెంట్లు కట్టుకునేందుకు వెళ్తుండగా..రెవెన్యూ అధికారులు అభ్యంతరాలు చెబుతుండడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇప్పటివరకు ఆరుగురికి ప్లాట్లు విక్రయించి రూ.3కోట్లు తీసుకున్నారు. మరికొందరికి విక్రయించేందుకుయత్నిస్తున్నారు.

బాధితుల ఫిర్యాదు..: ఖాజాగూడ కూడలికి సమీపంలో ప్రైవేటు వ్యక్తుల నుంచి స్థలం కొన్నవారు సర్వేనంబర్ 36, 40 నంబర్లలో చదును చేసుకునేందుకు వెళ్లగా రెవెన్యూ అధికారులు ఇవన్నీ ప్రభుత్వ భూములని అడ్డుకున్నారు. కొన్న పత్రాలు చూపగా.. మాకు సంబంధం లేదు.. పోలీసులకు ఫిర్యాదు చేయాలంటూ రెవెన్యూ అధికారులు వారికి తెలిపారు.

జీహెచ్ఎంసీ మార్టిగేజ్‌తో మాయాజాలం..

తప్పుడు పత్రాలతో స్థలాలను సొంతం చేసుకున్న అక్రమార్కులు వాటిలో అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నామంటూ రిజిస్ట్రేషన్ పత్రాలు, ప్లాన్‌లను జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో మూడేళ్ల క్రితం సమర్పించారు. నిబంధనల ప్రకారం అధికారులు సదరు నిర్మాణ స్థలాన్ని మార్టిగేజ్(తనఖా) ఉంచుకున్నారు. జీహెచ్ఎంసీ మార్టిగేజ్ చేసిన పత్రాలను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సమర్పించి రికార్డులు నవీకరించారు. కొద్దినెలల క్రితం నిర్మాణాలు చేపట్టగా.. రెవెన్యూ అధికారులు తెలుసుకుని నిలిపేశారు. తాజాగా రెండు, మూడు అపార్ట్‌మెంట్లు కట్టేందుకు పునాదులు తవ్వుతున్నారు. రెవెన్యూ అధికారులు గతంలో నిర్వాసితులకు ఇచ్చిన భూముల వివరాలు, వారి పేర్లను సరిచూస్తే... అక్రమాలన్నీ వెలుగుచూడనున్నాయి. నిర్వాసితుల వివరాలను సరిపోల్చితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి.

# రూ.150 కోట్లతో గ్రామీణ రహదారుల విస్తరణ



తాండూరు: తాండూరు నియోజకవర్గంలో గ్రామీణ రహదారులను విస్తరించడానికి రహదారులు, భవనాల శాఖ ప్రభుత్వానికి రూ.150 కోట్లతో ఇటీవలే ప్రతిపాదనలు పంపించింది. నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తారు. తాండూరు నుంచి జహీరాబాద్ వైపు వెళ్లే ప్రధాన రహదారి మార్గంలోని అత్కూర్ తండా నుంచి సిద్దన్న మడుగు తండా, తాండూరు మండలం గుండ్లమడుగు తండా నుంచి పెద్దేముల్ మండలం అడ్కిచర్ల, పెద్దేముల్ మండలం మారెపల్లి నుంచి మదనంతాపూరు, తాండూరు మండలం సంగెం కలాన్ నుంచి మల్కాపూరు గ్రామం వరకు ఉన్న రహదారులన్నీ ఒక వరుసతోనే ఉన్నాయి. తారు తొలగి పోయి గుంతల మయంగా మారాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయి. వర్షా కాలంలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉంటున్నాయి. ఇంజినీర్లు క్షేత్రస్థాయికి వెళ్లి రహదారుల తీరును పరిశీలించారు. ఒక వరుసతో ఉన్న ఆయా గ్రామాల్లోని రహదారులను రెండు వరుసల రహదారులుగా మారిస్తే తప్ప వాహనదారులు సౌకర్యంగా ప్రయాణించే వీలు లేదని గమనించారు. అన్ని రోడ్లను విస్తరించడానికి రూ.125 కోట్లు అవసరం అవుతాయంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

కాగ్నానదిపై మరో వంతెనకు రూ.25కోట్లు: కాగ్నానదిపై మరో వంతెన నిర్మాణానికి రహదారులు, భవనాల శాఖ ఇంజినీర్లు రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటికే తాండూరు- కొడంగల్, తాండూరు-వికారాబాద్, కరణ్‌కోట-జీవన్గి రహదారుల మార్గంలో నాలుగు వంతెనలు నిర్మాణమయ్యాయి. ఇందుకోసం రూ.45 కోట్లను వ్యయం చేశారు. 2017 నుంచి గడచిన ఏడాది వరకు వీటి నిర్మాణాలను పూర్తి చేశారు. తాజాగా తాండూరు నుంచి పరిగి, వికారాబాద్ నియోజక వర్గ గ్రామాలకు వెళ్లే రహదారి మార్గంలోని యాలాల మండలం కోకట్ గ్రామ సమీపం కాగ్నానదిపై కొత్తగా వంతెన నిర్మించడానికి రూ.25 కోట్లతో ప్రతి పాదనలు పంపించారు.

వరదొస్తే పూర్తిగా మునిగిపోతోంది

వర్షాకాలంలో కాగ్ననది ఉధ్ధృతంగా ప్రవహించినపడు తక్కువ ఎత్తులో ఉన్న వంతెన పూర్తిగా మునిగి పోతుంది. దీంతో ఇరువైపులా రాకపోకలు గంటల తరబడి స్తంభించడం ఇబ్బందిగా మారింది. నదిపై పాత వంతెన స్థానే ఎత్తు పెంచి కొత్తగా వంతెన నిర్మించాలని రాకపోకలు సాగించే సంబంధిత గ్రామాలకు చెందిన ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. దీంతో సమస్యను తీవ్రంగా పరిగణించిన ఇంజినీర్లు వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు.

నిధులు మంజూరు కాగానే వెంటనే పనులు ప్రారంభిస్తాం

ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే నిర్ణీత రహదారుల విస్తరణ, కోకట్ వంతెన నిర్మాణం పనులు చేపడతాం. ప్రస్తుత వేసవిలో పనులు నిర్వహించేందుకు అనుకూలంగా ఉందనే విషయాన్ని ప్రభుత్వానికి వివరించాం. నిధులు మంజూరు చేస్తే వెంటనే టెండర్లు పిలిచి కార్యాచరణ చేపడతాం.

# రూ.కోట్ల ఖర్చు.. ఉపయోగపడితే ఒట్టు!



వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణంలో సరైన మార్కెట్లు లేక పట్టణ ప్రజలు, కూరగాయల వ్యాపారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో పట్టణంలో రెండు ఆధునిక హంగులతో కూరగాయలు, మాంసం విక్రయాల మార్కెట్ల నిర్మాణానికి రూపకల్పన చేశారు. పట్టణంలోని శామకుంటలో రూ. 2.71 కోట్ల మున్సిపల్ నిధులతో, వ్యవసాయ మార్కెట్ యార్డులో రెండు ఎకరాల విస్తీర్ణంలో దాదాపు రూ. 4.5 కోట్ల ప్రభుత్వ నిధులతో అధునాతన వసతులతో సమీకృత (ఇంటిగ్రేటెడ్) కూరగాయల మార్కెట్ నిర్మాణానికి 2019లో అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ భూమిపూజ చేశారు. ఇందులో శామకుంటలోని కూరగాయల మార్కెట్ ఆధునిక హంగులతో నిర్మించి ప్రారంభించినప్పటికీ ఆదరణ కరవైంది. అందులో క్రయ, విక్రయాలు చేసేందుకు రైతులు, వ్యాపారులు ముందుకు రాక నిరుపయోగంగా మారింది.

శామకుంటలో నిర్మించిన కూరగాయల మార్కెట్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో 56 స్టాల్స్, మొదటి అంతస్తులో 54 స్టాల్స్‌ను ఆధునిక హంగులతో సకల సౌకర్యాలతో నిర్మించారు. ఇందులో విక్రయాలకు రైతుల నుంచి మున్సిపల్ అధికారులు దరఖాస్తులు ఆహ్వానించినా కేవలం నలుగురే ముందుకు వచ్చారు. దీంతో మరోసారి దరఖాస్తులను ఆహ్వానించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం రెండో బైపాస్ రోడ్డుపైనే క్రయ, విక్రయాలు చేస్తున్నారు. దీంతో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన మార్కెట్ వృథాగా ఉంది.

కలెక్టరు ఆదేశించినా...వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ. 4.5 కోట్లతో అధునాతన వసతులతో సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు పిల్లర్లకే పరిమితమయ్యాయి. సమీకృత మార్కెట్ నిర్మాణం మొదట ప్లాన్ ప్రకారం కాకుండా కొంత మార్పు చేయడంతో నిధులు సరిపోక గుత్తేదారు పనులు నిలిపివేశారు. ఏడాది అవుతున్నా తిరిగి కదలిక లేదు. ప్రభుత్వం మారడంతో బిల్లులు వస్తాయో, రావోననే ఆందోళన గుత్తేదారులో నెలకొంది. దీంతో సమీకృత మార్కెట్ నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. పలుమార్లు కలెక్టర్ పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినప్పటికీ పనుల్లో మాత్రం పురోగతి కనిపించడం లేదు. కూరగాయల స్టాల్స్ 54, నాన్‌వెజిటబుల్ స్టాల్స్ 38, పూలు, పండ్ల స్టాల్స్ 18 నిర్మించాలని భావించారు. ఇందులో మొదటి అంతస్తులో కూరగాయలు, పండ్లు నిల్వ చేసేందుకు కోల్డు స్టోరేజ్ ఏర్పాటు వంటి సదుపాయం కల్పించనున్నారు. సమీకృత మార్కెట్లో అన్ని వసతులు ఉండే విధంగా తీర్చిదిద్దనున్నారు. మార్కెట్ పూర్తయితే అన్ని రకాల కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలు ఒకే ప్రాంతంలో జరిగి పట్టణ ప్రజలు, చుట్టు పక్కల గ్రామాల వారికి సౌకర్యంగా ఉండనుంది.

# పలుకుబడి గుట్టల్లో కరుగుతున్న రాళ్లు

పెద్దపల్లి: ప్రభుత్వ అనుమతి గడువు ముగిసినా యథేచ్ఛగా బండరాళ్ల తవ్వకం, రవాణా చేస్తుండటంతో పరిసర ప్రాంత ప్రజలు శబ్ధ, వాయు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. అరికట్టాల్సిన ప్రభుత్వ శాఖలు తమ బాధ్యత కాదంటూ తప్పించుకుంటున్నాయి. రాష్ట్ర స్థాయిలో రాజకీయ అండదండలతో పాలకుర్తి మండలంలో గుట్టలను స్వాహా చేస్తున్నారు.

పాలకుర్తి ప్రాంతంలో మొత్తం 12 క్వారీలున్నాయి. వాటికి ప్రభుత్వం పదేళ్ల కాలపరిమితితో ఇచ్చిన అనుమతులు ముగియగా రెండు క్వారీలు మాత్రం తిరిగి అనుమతులు పొందాయి. మిగిలిన క్వారీల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇందులో రాష్ట్ర స్థాయిలో ఓ కీలక ప్రజాప్రతినిధి ప్రధాన అనుచరుడు ఉండటంతో గనులు, పర్యావరణ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు మిన్నకుండిపోతున్నారు.

పరిసర ప్రాంతాల్లో వ్యాధులు

రెండేళ్ల కిందట పాలకుర్తి మండలం కన్నాలలోని బోడగుట్ట సమీపంలోని ఓ క్వారీలో భారీ పేలుళ్ల వల్ల విద్యుత్తు హైటెన్షన్ తీగ తెగిపడిన ఘటనలో పలువురు కూలీలు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

పేలుడు సామగ్రిని మోతాదుకు మించి వాడటం వల్లే ఇలా జరిగిందని, పునరావృతమైతే కఠిన చర్యలుంటాయని అధికారులు హెచ్చరించి వదిలేశారు. అయితే నిర్వాహకులు మాత్రం విద్యుత్తు శాఖకు రూ.8 లక్షల వరకు జరిమానా చెల్లించి తిరిగి అక్కడి నుంచే పేలుళ్లు ప్రారంభించడం గమనార్హం.

క్రషర్ల నుంచి వెలువడే దుమ్ము, ధూళి నియంత్రణకు నిర్వాహకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో బోడగుట్టపల్లి, ధర్మారం క్రాస్‌రోడ్డు, కురుమపల్లి, ఘన్‌శ్యామ్‌దాస్‌నగర్ గ్రామాల ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు.

క్రషర్ల సమీపంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలుండటంతో దుమ్ము ధూళితో చిన్నారులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. ఒక్కో క్రషర్‌లో గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉండగా ఎక్కడా అమలు కావడం లేదు.

జనవరితోనే ముగిసిన గడువు

పాలకుర్తి మండలం ఘన్‌శ్యామ్‌దాస్‌నగర్‌లో 12 క్వారీలుండగా ఒక్కో క్వారీ నిర్వాహకులు గరిష్ఠంగా పదేళ్ల కాలపరిమితితో గనులు, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి, తదితర శాఖల వద్ద తవ్వకాలు, రవాణా అనుమతులు తీసుకున్నారు. 2014 జనవరి నుంచి 2024 జనవరి 23 వరకు అనుమతులు పొందగా గడువు ముగిసినా అక్రమంగా తవ్వకాలు చేపడుతూ రాత్రి వేళల్లో బండరాళ్లు తరలిస్తున్నారు.

ఎవరికి వారు.. బాధ్యతల విస్మరణ

పాలకుర్తి మండలంలో రెండు క్వారీలు మాత్రమే తిరిగి అనుమతులు పొందాయని, మిగిలిన క్వారీల నిర్వాహకులు పర్యావరణ అనుమతులు లేకుండానే పేలుళ్లు, తవ్వకాలు జరుపుతున్నారని రామగుండం పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భిక్షపతి ‘ఈనాడు’కు తెలిపారు. ఈ క్వారీల నుంచి రెండేళ్లుగా రూ.58.20 కోట్ల మేర రాయల్టీని వసూలు చేశామని జిల్లా గనుల శాఖ అధికారి సాయినాథ్ చెప్పారు. అర్ధరాత్రి పేలుళ్లు, రవాణాపై బసంత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై బసంత్‌నగర్ ఎస్సై స్వామిని వివరణ కోరితే అనుమతులు లేని క్వారీలను మూసివేసే బాధ్యత గనుల శాఖదేనని, వారు మూసివేస్తే రవాణాకు అవకాశం ఉండదని తెలిపారు.

వే బిల్లులు లేకుండానే తరలింపు

జిల్లాకేంద్రానికి 10-20 కిలోమీటర్ల పరిధిలో కన్నాల, బొంపల్లి, బేగంపేట, కుక్కలగూడూరు, మారేడుపల్లి, జయ్యారం, సుల్తానాబాద్ ప్రాంతాల్లో పెద్ద గుట్టలున్నాయి. హెక్టారుకు రూ.50 వేల చొప్పున ప్రభుత్వం అద్దె నిర్ణయించగా ఇందులో తొలిచే బండరాళ్లపై క్యూబిక్ మీటరుకు దాదాపు రూ.101 చొప్పున రాయల్టీగా చెల్లించాల్సి ఉంటుంది. క్రషర్లు లేని క్వారీ యజమానులు క్యూబిక్ మీటరు బండరాళ్లను రూ.170కు విక్రయిస్తుంటారు. లక్షల క్యూబిక్ మీటర్ల కంకర తవ్వుతుండగా వేల క్యూబిక్ మీటర్లకు మాత్రమే లెక్క చూపుతున్నారు బిల్లులు లేకుండానే అక్రమంగా బండరాళ్లను తరలిస్తున్నారు. అనుమతులు లేని ప్రాంతాల్లోనూ తవ్వకాలు నిర్వహిస్తున్నారు.

# గుట్టలు తొలుస్తూ.. కాలువలు మూసివేస్తూ!

మల్యాల: కొండగట్టు ప్రాంతంలో కొందరు స్థిరాస్తి వ్యాపారులు ‘వాల్టా’ చట్టాన్ని ఉల్లంఘిస్తూ గుట్టలను ధ్వంసం చేస్తున్నారు. ప్లాట్లకు అడ్డుగా ఉన్న కాలువలను మూసివేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారుల అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు తీసుకునేవారులేరు. కొండగట్టు ఘాట్‌రోడ్డు పక్కన పట్టా భూములున్నప్పటికీ స్థిరాస్తి వ్యాపారులు తమ భూముల్లో నిర్మాణాలు చేపట్టడానికి చెట్లను తొలగిస్తూ గుట్టలను కూడా చదును చేస్తున్నారు.గుట్ట ప్రాంతం నుంచి భారీగా ప్రవహించే వర్షపు నీరు వెళ్లడానికి పూర్వం నుంచి ఉన్న కాలువలను పూడ్చివేయడంతో వర్షాకాలంలో వరద నీరు నివాస ప్రాంతాల్లోకి చేరుతున్నాయి. దాదాపు పదేళ్ల కిందట ఘాట్‌రోడ్డు పక్కన కాలువను ఆక్రమించుకుని భవన నిర్మాణాలు చేపట్టడంతో వర్షాకాలంలో వరద నీరు ఎటూ వెళ్లడం లేదు. ఆ ప్రాంతంలో తాత్కాలికంగా ఏర్పాటుచేసుకున్న పూడిగుడిసెల్లోకి వరద నీరు చేరడంతో అప్పటి తహసీల్దారు, సిబ్బంది పరిశీలించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఘాట్‌రోడ్డు పక్కన అంజన్న ఆలయానికి చెందిన భూములను కూడా ఆక్రమించుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. స్థిరాస్తి వ్యాపారులు కొండగట్టు ప్రాంతంలో ‘లేఅవుట్’ ప్రకారం కాకుండా అక్రమంగా ప్లాట్లు విక్రయిస్తున్నారని స్థానిక నాయకులు మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కొందరికి నోటీసులు జారీచేసి హద్దురాళ్లు తొలగించినట్లు ముత్యంపేట(కొండగట్టు) గ్రామపంచాయతీ సిబ్బంది తెలిపారు. గతంలో భవన నిర్మాణాలకు అనుమతి మంజూరు సమయంలో పురాతన జలబుగ్గ కాలువకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చేపట్టాలని గ్రామపంచాయతీ అదికారులు ఆదేశాలిచ్చారు. అయినప్పటికీ జలబుగ్గ కాలువను బండరాళ్లు, మట్టితో పూడ్చివేసి ఏకంగా దానిపై నుంచి వాహనాలు వెళ్లడానికి వీలుగా దారి నిర్మించుకున్నారు. అయినప్పటికీ సంబంధితశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలు తేలితే చర్యలు : మునీందర్, తహసీల్దారు, మల్యాల

కొండగట్టు ఘాట్‌రోడ్డు పక్కన కొందరు స్థిరాస్తి వ్యాపారులు అటవీ, అంజన్న ఆలయ భూములను ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు మా దృష్టికి రావడంతో వెళ్లి పరిశీలించాం. ప్రాథమికంగా ఆక్రమణలు లేకపోయినప్పటికీ సర్వేయరుతో సమగ్ర సర్వే నిర్వహిస్తాం. సర్వేలో ఎలాంటి ఆక్రమణలు తేలినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

# గుంటల్లో పట్టా.. అధికారులకు కాసుల పంట

గంగాధర: నగర, పట్టణ కేంద్రాల్లోనే కాదు పల్లెల్లోనూ అధునాతన భవనాలు నిర్మించుకోవడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రహదారుల వెంట ఉన్న వ్యవసాయ పట్టా స్థలాలను కొందరు వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి వెంచర్లు చేస్తున్నారు. అమాయక ప్రజలకు లేనిపోని ఆశలు కల్పించి వారు తప్పుదోవ పట్టించడంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఇందుకు రెవెన్యూ అధికారులు సహకరిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు.

ఎక్కడెక్కడంటే..

జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న గంగాధర, రామడుగు, చొప్పదండి మండల కేంద్రాలతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లోనూ ఎకరా నుంచి పది ఎకరాలు ఆపైనా కొనుగోలు చేస్తున్న స్థిరాస్తి వ్యాపారులు అక్రమ వెంచర్లు చేసి భూదందా కొనసాగిస్తున్నారు. గంగాధర, మధురానగర్, కురిక్యాల, వెంకంపల్లి, గర్శకుర్తి, గట్టుబూత్కూర్, లక్ష్మీదేవిపల్లి, ఒద్యారం, గోపాల్‌రావుపేట, దేశరాజ్‌పల్లి, వెలిచాల, చొప్పదండి, ఆర్నకొండ, రాగంపేట గ్రామాలతోపాటు ఇతర తిమ్మాపూర్, మానకొండూరు ఇతర మండలాల్లోనూ స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. కొందరు నిబంధనలు పాటిస్తుండగా చాలాచోట్ల నాలా పన్ను, డీటీసీపీ రుసుంలు చెల్లించకుండా వ్యాపారులు భారీగా మూటకట్టుకుంటున్నారు. ప్రభుత్వం భారీగా ఆదాయం నష్టపోతుంది. 30 అడుగుల దారులు, మురుగుకాలువలు, పార్కులకు స్థల కేటాయింపు, వీధి దీపాలు, ఇతర సదుపాయాలు, కల్పించాకే స్థలం అమ్మాల్సి ఉండగా ఇవేవీ లేకుండానే అంటగడుతున్నారు.

కనిపించని మార్పు...

జిల్లాలోని 16 మండలాల్లో రోజుకు 5 నుంచి 15 వ్యవసాయ భూముల పట్టా మార్పిడి జరుగుతుండగా ఇందులో గుంటల్లో కనీసం 3 నుంచి 5 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. వాస్తవానికి స్లాట్ బుక్ చేసుకుని ప్రభుత్వానికి చలానా రుసుం చెల్లించాక రెవెన్యూ కార్యాలయంలో



పనులు పూర్తి చేయాలి. కానీ కొన్ని చోట్ల వినియోగదారుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చరవాణి నుంచైనా స్లాట్ బుక్ చేసుకునేందుకు 'సిటిజన్ ఫ్రెండ్లీ' పేరుతో ధరణిలో అవకాశం కల్పించగా కొన్ని చోట్ల ఆపరేటర్లే మధ్యవర్తుల అవతారం ఎత్తి ఆమ్యామ్యాలు దండుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా ధరణి ఆపరేటర్లను బదిలీ చేయగా కొందరిలో ఇప్పటికీ మార్పు రాలేదనే అభిప్రాయాలున్నాయి.

నిబంధనలు ఇలా.. నష్టాలు ఇవీ..

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా (నాలా) మార్చుకోవడానికి మూడు గుంటల్లోపు రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు భూమి విలువపై 5 శాతం చలానా చెల్లించాలి. ఇలా మార్చుకున్నాకే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పొడవు, వెడల్పు పటం (మ్యాప్) గీసి నాలుగు దిక్కులు హద్దులు, వ్యక్తుల పేర్లు డాక్యుమెంట్లలో నమోదు చేస్తారు. దీనిని తీసుకొని సంబంధిత గ్రామ పంచాయతీలో ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న వెంటనే అనుమతులు ఇస్తారు. ఈ భూమికి రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు అందవు.

రెవెన్యూ కార్యాలయంలో గుంటల్లో పట్టా మార్పిడి చేసుకుంటున్నారు. ఇందుకు పట్టా పాసు పుస్తకం ఉంటే సరిపోతుంది. సేల్ డీడ్‌కు 7.5 శాతం, గిఫ్ట్ డీడ్‌కు 3 నుంచి 7 శాతం, పార్టిషన్, సెటిల్‌మెంట్ డీడ్‌కు 3 శాతం భూమి విలువపై చలానా చెల్లించాల్సి ఉంటుంది. నాలా లేకుండా గుంటల్లో పట్టా చేసుకున్న స్థలంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు రావనే విషయం తెలియక చాలామంది కొన్న తర్వాత ఇబ్బందిపడుతున్నారు. రైతుబంధు, బీమా వర్తిస్తుందని చెబుతుండడంతో కొనుగోలుదారులు అలాగే చేసుకుంటున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయితే గంగాధరలో ఎకరాకు మార్కెట్ విలువ రూ.6.75 లక్షలు ఉండగా గుంటకు రూ.850, గ్రామాల్లో గుంటకు రూ.570 చలానా రుసుం ప్రభుత్వానికి చెల్లించాలి. అదే భూమి నాలాతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పట్టా మార్పిడికి గుంటకు రూ.11 వేలు చలానా రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇక దస్తావేజు లేఖరి, కార్యాలయ సిబ్బంది ఖర్చులు అదనంగా ఉంటుందని, స్థిరాస్తి వ్యాపారులు భూమి కొనుగోలుదారులకు ఇవేవీ చెప్పకుండా నాలా లేకుండానే సరాసరిగా రెవెన్యూ కార్యాలయాల్లో భూమి పట్టా తంతు ముగిస్తున్నారు. దీనిని ఆసరాగా తీసుకుంటున్న పలువురు రెవెన్యూ అధికారులు ధరణి ఆపరేటర్లను మధ్యవర్తులుగా ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# నీటి కొరత.. రైతుకు గుండె కోత

వ్యవసాయ బావిలో జలాలను నమ్ముకొని రామడుగు మండలం షానగర్ గ్రామానికి చెందిన రైతు పర్లపెల్లి మల్లయ్య ఎకరం పొలం సాగు చేశారు. కానీ భూగర్భ జలాలు అడుగంటడంతో పొలానికి నీరు రాకుండా పోయింది. ఈ ఒక రైతు పరిస్థితే కాదు. మెట్టప్రాంతమైన రామడుగు మండలంలోని చాలా గ్రామాల్లో ఈ సమస్య ఉంది. బావుల్లో రోజురోజుకూ నీటి లభ్యత తగ్గడంతో పంట కోత దశకు సాగు నీరు అందటంపై రైతులు దిగులు చెందుతున్నారు. రామడుగు మండలంలో నాలుగేళ్లుగా ఎస్సారెస్పీ వరద కాలువ నింపి ఉంచడంతో భూగర్భ జలాలు కొరత లేకుండా పోయింది. ఈసారి వరద కాలువ ఖాళీ కావడంతో యాసంగి పంట కాలంలో కష్టాలు మొదలయ్యాయి. మండలంలో ప్రవహించే మోతెవాగు ఈ సంవత్సరం చుక్క నీరు లేకుండా ఖాళీ అయింది. ఓ వైపు కాకతీయ కాలువ, మరో వైపు గాయత్రీ పంప్‌హౌస్, ఎస్సారెస్పీ వరద కాలువ, ఎగువన నారాయణపూర్ చెరువు ఇలా అన్ని ఉన్నా రామడుగు మండలానికి నేరుగా సాగునీటి కాలువల సదుపాయం లేకపోవడంతో పంటల సాగు సవాలుగా మారింది. మండల వ్యాప్తంగా పదహారు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తుండగా కోత దశ వరకు సాగునీటి సరఫరా చేయటంపై రైతులు దిగులు చెందుతున్నారు.

# ఒడిసిపట్టలేక.. విడిచిపెడతారా?



హైదరాబాద్: రాజధానిలో ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటాయి. గోదావరి, కృష్ణా నుంచి నగర అవసరాలకు సరిపడా నీటి సరఫరా లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో తక్కువ పీడనంతో నీటి సరఫరా అవుతోంది. బెంగళూరు తరహా నీటి సంక్షోభం ఇక్కడ రాకపోయినా తాగునీటి ఇబ్బందులు ఈ వేసవిలో తీవ్రంగా ఉత్పన్నమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈనేపథ్యంలో వాన నీటి సంరక్షణ చర్యలు తీసుకోకపోతే మహానగరంలో తాగునీటి సంక్షోభం ముంచుకొస్తుందంటూ రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని హెచ్చరించిన విషయం తెలిసిందే. పదేళ్లుగా చూస్తే వాన నీటి సంరక్షణ మీద జీహెచ్ఎంసీ, జలమండలి రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నామంటూ లెక్కలు చూపిస్తున్నా..క్షేత్రస్థాయిలో అధికారులు విఫలమయ్యారు. కొత్తగా ఇంకుడు గుంతలు తవ్వించడానికి కూడా బల్దియా ప్రణాళికను రూపొందించడం లేదు.

అపార్ట్‌మెంట్లలో..? నగరంలో దాదాపు 5లక్షల వరకు అపార్టుమెంట్లు ఉన్నాయి. వాన నీటి సంరక్షణ కోసం ప్రతి అపార్టుమెంట్‌లోనూ రెండు నుంచి నాలుగు వరకు ఇంకుడుగుంతలు ఏర్పాటు చేయాలన్న నిబంధన ఉంది. కొన్నేళ్ల కిందట ఈ నిబంధనను బాగానే అమలు చేసిన అధికారులు.. ఐదేళ్లుగా నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. ఎనభై శాతం అపార్టుమెంట్లలో అసలు ఇంకుడుగుంతల ఆనవాళ్లే లేవు. ఫలితంగా భారీ వర్షాలు కురిసినపుడు వాననీరు భూమిలో ఇంకడానికి బదులుగా రోడ్ల మీదకు చేరుతోంది.

నివేదిక బుట్టదాఖలు..: నగర రోడ్లపై నిలిచిన నీరు భూగర్భంలో ఇంకడం కోసం పల్లపు ప్రాంతాల్లో అధికంగా ఇంకుడు గుంతలు తవ్వాలని మూడేళ్ల కిందట జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు బల్దియాకు నివేదిక ఇచ్చారు. దానిని అప్పటి బల్దియా కమిషనర్ జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. ఆ తరువాత పట్టించుకోవడం మానేశారు. ఇప్పటికైనా బల్దియా, జలమండలి ఏకమై వాన నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయ్

ఎండలు పెరుగుతుండటంతో క్రమేపీ భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. నగరంతో పాటు శివార్లలో ఈ పరిస్థితి నెలకొంది. గత జనవరి నెల లెక్కల ప్రకారం మహానగరవ్యాప్తంగా 1.31 మీటర్లు వరకు అడుగంటాయి. సికింద్రాబాద్ ప్రాంతంలో 1.41 మీటర్ల వరకు తగ్గుదల కనిపించింది. వచ్చే రెండు నెలల్లో మరింత తగ్గే సూచనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అందరూ నీటి వృథాను అరికట్టడంతో పాటు పొదుపు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. వాననీటి సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

రూ. 25 కోట్లు మట్టిలో పోసినట్లే..

గ్రేటర్‌లో గతంలో 100 రోజుల పథకంలో భాగంగా జలమండలి ఇంకుడుగుంతలు నిర్మించింది. విడతల వారీగా పలు కాలనీలు, పార్కుల్లో 20 వేల పైగా గుంతలు ఏర్పాటు చేసింది. ప్రతి గుంతకు జియోట్యాంగింగ్ విధానంతో అనుసంధానం చేశామని అప్పట్లో ప్రకటించారు. ఒక్కోదానికి రూ.30వేల నుంచి రూ.50 వేల చొప్పున దాదాపు రూ.25 కోట్ల వరకు వ్యయం చేశారు. ఆ తరువాత అధికారులు వీటి నిర్వహణను మరిచిపోయారు. దీంతో రూ.కోట్ల వ్యయంతో తవ్విన ఇంకుడుగుంతలన్నీ పూడిపోయాయి. ఇప్పుడు చాలాచోట్ల వాటి ఆనవాళ్లు కూడా కన్పించడం లేదు.

# ఎలివేటెడ్ కారిడార్.. పుష్కరం క్రితమే కట్టాలనుకున్నా..



హైదరాబాద్: ప్యారడైజ్ కూడలి నుంచి డెయిరీ ఫాం రోడ్డు వరకు దూరం తక్కువే అయినా కంటోన్మెంట్‌లో ఇరుకుదారులతో నిత్యం ట్రాఫిక్ కష్టాలే. దీన్నుంచి బయటపడేందుకు ఈ మార్గంలో 4.650 కి.మీ. పొడవునా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఇటీవల సర్కారు శంకుస్థాపన చేసింది. ఇది పూర్తైతే దేశంలోనే అతిపెద్ద డబుల్ డెక్కర్ కారిడార్ మనదే అవుతుంది. మొదటి డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ను నాగ్‌పూర్‌లో నిర్మించారు. వార్ధా రోడ్‌లో 3.14 కి.మీ. దూరం వేశారు. మొదటి అంతస్తులో రహదారి, ఆపై రెండో అంతస్తులో మెట్రో కోసం కట్టారు. 3 స్టేషన్లున్నాయి. అప్పట్లో ఇది గిన్నిస్ రికార్డులకెక్కింది.

ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రతిపాదించినా..

మెట్రో మొదటిదశలో ప్యారడైజ్ నుంచి ప్యాట్నీ వరకు ఉన్న ఫ్లైఓవర్లను తొలగించి వాటి స్థానంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్‌ను పుష్కరకాలం క్రితమే ప్రతిపాదించారు. ఈ మార్గంలో రెండే లేన్లతో ఇరుకుగా ఉన్నాయి. వీటి తొలగించి ఆరు లేన్లతో రహదారి, ఆపైన మెట్రో వేయాలనే మెట్రో అధికారులు నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఫ్లైఓవర్లను కూల్చకుండానే పక్క నుంచి వేయాలని సూచించడంతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ కార్యరూపం దాల్చలేదు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చొరవతో నాగ్‌పూర్‌లో మొదటిది నిర్మించారు. నగరాల్లో జాతీయ రహదారులపై ఎక్కడ పైవంతెనలు నిర్మించే ఆలోచన ఉన్నా.. అక్కడ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్‌ను పరిశీలించాలని అధికారులను ఆయన ఆదేశించారు. తాజాగా ప్యారడైజ్ కారిడార్ పూర్తిచేస్తే తర్వాత హయత్‌నగర్, పటాన్‌చెరు మార్గాల్లోనూ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌లు వచ్చే అవకాశం ఉంది.

తగ్గనున్న నిర్మాణ వ్యయం ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఒకే మార్గంలో ఫ్లైఓవర్లు, మెట్రో నిర్మాణాలు అనివార్యమవుతున్నాయి. తొలుత పైవంతెన నిర్మించాక అక్కడ మెట్రో వేయాలంటే చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. డివైడర్ ప్రాంతంలో కాకుండా కాలిబాటలో మెట్రో స్తంభాలు నిర్మించాలి. అప్పుడు భవనాల పక్క నుంచే మెట్రో వెళ్లడం భద్రత సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. కొన్నిచోట్ల ఆస్తులను సేకరించాల్సి వస్తోంది. ఇవన్నీ వ్యయం పెరిగేందుకు కారణం అవుతుంది. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించుకుంటే ఒకేసారి స్తంభాల పనులను పూర్తిచేయవచ్చు. దీంతో వ్యయం చాలా తగ్గుతుంది. రహదారులు, మెట్రోను ఏకకాలంలో పూర్తిచేయవచ్చు. లేదంటే మొదట రహదారి పూర్తిచేసి అవసరాన్నిబట్టి మెట్రో నిర్మించుకోవచ్చు.

# తెరపై తండా వాసులూ.. తెరవెనుక రియల్టర్లు



హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలోని మదనపల్లి తండాలో ఏళ్ల క్రితం గిరిజనులకు ఇచ్చిన అసైన్డ్ భూములను కొందరు రియల్టర్లు ఆక్రమించుకుని ప్లాట్లగా విక్రయిస్తున్నారు. హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారికి దగ్గరగా ఉండటంతో.. రైతులను బెదిరించి వందల ఎకరాల భూములు లాక్కున్నారు. మూడు వందలు, ఐదు వందల గజాల చొప్పున విక్రయించారు. తాజాగా ఒకటి, రెండు గదులు నిర్మించి వాటికి గ్రామ పంచాయతీ అధికారుల సహకారంతో ఇంటి నంబర్లు వేయించారు. తర్వాత వాటికి పన్నులు వేసి రసీదుల సహాయంతో రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. అసైన్డ్ భూములను ఆక్రమించుకుంటున్నా రెవెన్యూ అధికారులు అటువైపు తొంగిచూడటం లేదు. అసైన్డ్ భూములని తెలిసినా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఇళ్లను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇప్పుడు మరో వంద ఎకరాలు ఆక్రమించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సాగుకోసం ఇస్తే... శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న పేద గిరిజనులకు 46ఏళ్ల క్రితం అప్పటి రెవెన్యూ అధికారులు మదనపల్లి తండాలో 559 ఎకరాలు వ్యవసాయానికి ఇచ్చారు. చాలామంది రైతులు ఇరవై ఏళ్ల క్రితం వరకూ సాగు చేశారు. తర్వాతి రోజుల్లో శంషాబాద్ విమానాశ్రయం ప్రారంభం కావడంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలొచ్చాయి. తండా వాసుల్లో కొందరు విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో పనులు చేసుకుంటున్నారు. దీంతో సగానికిపైగా భూములు పడావుగా ఉండగా.. 200 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు.

రూ.లక్షలిస్తామంటూ ప్రలోభాలు...

మదనపల్లి తండాలో అసైన్డ్ భూములున్నాయని తెలుసుకున్న హైదరాబాద్ రియల్టర్లు రైతులను భయపెట్టారు. విక్రయిస్తే రూ.లక్షల్లో నగదు, కొంత భూమి ఇచ్చి ఇల్లు కట్టిస్తామని ప్రలోభపెట్టారు. అలా 300 ఎకరాలకుపైగా సొంతం చేసుకున్నారు. కొద్దినెలల క్రితం రైతులు ఆందోళన చేయగా.. అధికారులు రియల్టర్లను అడ్డుకున్నారు. కొద్ది రోజులు పనులు నిలిపేసినా.. పదిరోజుల నుంచి మళ్లీ ప్లాట్లుగా విభజించి విక్రయాలు మొదలుపెట్టారు.

# టికెట్లు ఎవరి హస్తగతం!

కరీంనగర్: లోక్‌సభ ఎన్నికలకు ప్రత్యర్థి పార్టీలు సన్నద్ధమై అభ్యర్థులను ప్రకటించినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆచితూచి అడుగులేస్తోంది. అభ్యర్థుల ఎంపిక విషయంలో అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటోంది.. సామాజిక సమీకరణాలు.. అంగ.. అర్థబలం ఆధారంగా బలమైన నాయకులను బరిలో దించేందుకు కసరత్తు చేస్తోంది.. కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఒకట్రెండు రోజుల్లో అధికారికంగా జాబితాను వెల్లడించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ కోసం ఉత్సాహం చూపుతున్న నాయకులతోపాటు పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గాలకు ప్రత్యర్థులకు దీటైన అభ్యర్థులను రంగంలోకి దించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఆలోచిస్తోంది. ఇప్పటికే గాంధీభవన్‌లో పలుమార్లు డీసీసీ అధ్యక్షులు, ముఖ్యనేతలతో సమావేశం కాగా.. అభ్యర్థుల ఎంపిక విషయంలో వారి అభిప్రాయాల్ని తెలిపారు. ఈ మూడు స్థానాల పరిధిలో ఎవరైతే బాగుంటుందనే విషయాన్ని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షికి విన్నవించారు. దీంతో రాష్ట్ర స్థాయి ముఖ్యనేతలు కొన్ని పేర్లతో కూడిన జాబితాను పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)కి పంపించారు దిల్లీలో సీఈసీ సమావేశం జరుగనుండటంతో ఆ సమావేశం అనంతరం అభ్యర్థులను ప్రకటించే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ప్రత్యర్థులకు దీటుగా..

మూడు స్థానాల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దింపే యోచనలో హస్తం పార్టీ ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. భాజపా ఇద్దరు సిట్టింగ్‌లు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్‌లకు అవకాశమివ్వగా.. పెద్దపల్లికి కొత్త అభ్యర్థి గోమాసె శ్రీనివాస్‌ను ప్రకటించింది. ఇటీవలే కమలం పార్టీలో చేరిన ఆయన అనూహ్యంగా టికెట్ దక్కించుకున్నారు. భారాస కరీంనగర్‌లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌కు మరోసారి అవకాశమివ్వగా సామాజిక సమీకరణాలు తదితర అంశాలు పరిగణలోకి తీసుకుని నిజామాబాద్‌కు బాజిరెడ్డి గోవర్ధన్, పెద్దపల్లికి కొప్పుల ఈశ్వర్‌లను ఖరారు చేసింది. ప్రత్యర్థుల వ్యూహాలను గమనిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆయా స్థానాల్లో సామాజిక సమీకరణలను లెక్కలేస్తోంది. ఎవరికి టికెట్ ఇస్తే గెలుపు అవకాశాలు ఎక్కువ ఉంటాయనే విషయమై సమాలోచనల్ని జరుపుతోంది. కరీంనగర్ విషయంలో అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి దాదాపుగా టికెట్ ఖాయమనే ప్రచారం జరుగుతోంది. ఆయన పలు పట్టణాల్లో గోడ పత్రికలు వేసుకోవడంతో ఆయన పోటీకి సిద్ధమయ్యారనే సంకేతాలు పార్టీ శ్రేణులకు అందాయి. మరోవైపు వెలిచాల రాజేందర్‌రావు కూడా టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నిజామాబాద్ స్థానం కోసం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. పెద్దపల్లి నియోజకవర్గం విషయంలో మాత్రం పార్టీ అధిష్ఠానానికి తర్జనభర్జన తప్పడం లేదు. ఇక్కడ చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ కుమారుడు వంశీకి టికెట్ వస్తుందనే ప్రచారం బలంగా ఉంది. ఇదే సమయంలో భారాసను వీడి కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేతకు కూడా అవకాశాలు లేకపోలేదనే చర్చ పార్టీలో జరుగుతోంది. మరోవైపు మహిళా కోటాగా గతంలో ఈ స్థానంలో గెలిచిన నాయకురాలికి కూడా టికెట్ దక్కే అవకాశాలున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. తమ పార్టీ అభ్యర్థులను కూడా త్వరగా తేలిస్తే ఎన్నికల పోరులో ముందుండొచ్చని ఆ పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

# ఆకాశహర్మ్యాలు ఇప్పుడే కాదు

హైదరాబాద్: జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో ఆకాశహర్మ్యాలకు అనుమతులివ్వొద్దని ఆయా సంస్థల ప్రణాళిక విభాగాలు నిర్ణయించాయి. ప్రభుత్వం చెప్పే వరకు ఎత్తైన కట్టడాలకు సంబంధించిన దరఖాస్తులను ఆపాలని అనధికారికంగా తీర్మానించుకున్నాయి. దాదాపు రెండు నెలలుగా ఇదే పరిస్థితి. 4040చదరపు మీటర్లలోపు (ఎకరం) భూములకే నిర్మాణ అనుమతులివ్వాలన్న ప్రభుత్వ సూచనతో అధికారులు ఆ నిర్ణయం తీసుకున్నారు. దాంతో.. రెండు సంస్థల



పరిధిలో కలిపి ఆకాశహర్మ్యాలకు చెందిన సుమారు వంద దరఖాస్తులు ఆగిపోయాయి. తాజాగా నాలుగు ప్రాజెక్టులకు అనుమతులు మంజూరైనట్లు, ప్రత్యేక సిఫార్సుతో అధికారులు వాటికి పచ్చజెండా ఊపారని సమాచారం.

ఆలస్యం అందుకేనా.. : 30, 40 అంతస్తులంటూ ఆకాశహర్మ్యాలను నిర్మించడం వల్ల.. వాటి నుంచి వచ్చే వాహనాలతో చుట్టుపక్కల రోడ్లు కిక్కిరిసిపోతున్నాయని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగంగా అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎకరం విస్తీర్ణంలో చేపట్టే ప్రాజెక్టులకే అనుమతులివ్వాలనే అనధికార ఆదేశాలిచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కొత్తగా మొదలవుతోన్న ప్రాజెక్టులన్నీ ఎనిమిది అంతస్తుల నుంచి పది అంతస్తులు ఉండటమే అందుకు నిదర్శనం.శ్రీనివాస్, డీఈఈ, రహదారులు, భవనాల శాఖ, తాండూరు.




హైదరాబాద్: మూడేళ్ల పాటు తెలంగాణకు గవర్నర్‌గా వ్యవహరించిన తమిళిసై రాజీనామా తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది. అసలెందుకు ఆమె రాజీనామా చేశారు? గత సీఎం కేసీఆర్‌తో ఢీ అంటే ఢీ అన్న సమయంలో కూడా ఆమె రాజీనామా చేయాలని కూడా ఆమె చెప్పలేదు. అయితే ఇప్పుడెందుకు? అంటే దీనికి కారణం లేకపోలేదు. లోక్‌సభ ఎన్నికల నగారా మోగింది. ఈ క్రమంలోనే తమిళిసై ప్రత్యక్ష రాజకీయాల్లోకి తిరిగి రావాలనుకుంటున్నారట. తమిళనాడు నుంచి ఎన్నికల బరిలో దిగాలనుకుంటున్నారని టాక్.

## లోక్‌సభ ఎన్నికల తర్వాత.. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్.. ఎంపీ లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు



జగిత్యాల: లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు కాబోతుందని రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

జగిత్యాలలో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయసంకల్ప సభలో ఆయన మాట్లాడారు. వంద రోజుల పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రేవంత్ కేసీఆర్‌ను మరిపిస్తున్నారని ఎద్దేవా చేశారు.

**మూడోసారి మేమే..** కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. వంద రోజులు గొప్ప పాలన అందిచా.. పీసీసీ చీఫ్‌గా తన సత్తా చూపిస్తానంటున్నారని.. ఇదే మాటకు రేవంత్ కట్టుబడి ఉండాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 14 సీట్లు గెలుస్తామని కాంగ్రెస్ చెబుతోందని.. ఈ సవాల్‌కు రేవంత్ కట్టుబడాలని లక్ష్మణ్ కోరారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా తీసుకుని రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత తీసుకోవాలన్నారు.

**వచ్చేది డబుల్ ఇంజిన్ సర్కార్..** దేశంలో కాంగ్రెస్ లేదని, రానున్న రోజుల్లో తెలంగాణలోనూ ఆ పార్టీ కనిపించదని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్న రేవంత్ ఆరోపణలు అవాస్తవమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాము పడగొట్టబోమని, పడిపోతే కాపడబోమని చెప్పారు. తాము గేట్లు తెరిచామంటున్నారని.. జాగ్రత్తగా చూసుకోవాలని.. మీ ఎమ్మెల్యేలు పారిపోయేలా ఉన్నారు కాపాడుకోవాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని, డబుల్ ఇంజిన్ సర్కార్ రాబోతుందన్నారు.

## చంద్రబాబును కలిసిన మాజీ ఎంపీ రమేష్ రాథోడ్.. కారణమేంటంటే..



అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబును ఇవాళ అదిలాబాద్ మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ కలిశారు. దీంతో ఒక్కసారిగా కలకలం రేగింది? రమేష్ రాథోడ్ ఎందుకు చంద్రబాబుని కలిశారనే చర్చ తెలంగాణలో ప్రారంభమైంది. రమేష్ రాథోడ్ మాత్రం తాను మర్యాదపూర్వకంగా చంద్రబాబును కలవడానికి వచ్చానని చెబుతున్నారు. సుదీర్ఘ కాలం పాటు టీడీపీలో పని చేసిన ఆయనకు చంద్రబాబుతో మంచి సన్నిహిత సంబంధాలున్నాయి. ప్రస్తుతం ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే తిరిగి ఆదిలాబాద్ ఎంపీ టికెట్ కోసం ప్రధాని మోదీకి సిఫార్సు చేయాలని చంద్రబాబును రమేష్ రాథోడ్ కోరినట్టుగా ప్రచారం జరుగుతోంది.

## నేను అసమర్థుడిని కాను.. సీఎం రేవంత్ పై ప్రవీణ్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు



టీఎస్పీఎస్సీ ఛైర్మన్ గా తనను నియమిస్తారని వచ్చిన వదంతులపై ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ స్పందించారు. తనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంప్రదించిన మాట వాస్తవమేనని అన్నారు. కానీ ఆ పదవిని తాను సున్నితంగా తిరస్కరించినట్లు వివరించారు. తనకు ఏ పదవులు అవసరం లేదని ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. ఓ వైపు పాలమూరు బిడ్డ అని చెబుతున్న రేవంత్.. మరోవైపు తాను బీఆర్ఎస్ లోకి చేరితే ప్రజలకు సమాధానం చెప్పాలనడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు.

తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ లేదా అని ప్రశ్నించారు. ఈ పరిణామాలను బట్టి చూస్తే రేవంత్ తనకు వార్నింగ్ ఇస్తున్నట్లు అర్థమవుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గేట్లు తెరిస్తే అందులో జాయిన్ అవడానికి తాను అసమర్థుడిని కానని.. నిజమైన, నిస్వార్థమైన, నిజాయతీ కోసం పనిచేసే వ్యక్తిని అని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




జగిత్యాల: ప్రపంచంలో అతిపెద్ద ఎన్నికల పండగ ప్రారంభమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తెలంగాణ ప్రజలు సరికొత్త చరిత్రను లిఖించబోతున్నారని పేర్కొన్నారు. జగిత్యాలలో జరిగిన భాజపా విజయ సంకల్ప సభలో మోదీ పాల్గొని ప్రసంగించారు. ఆరంభంలో కాసేపు తెలుగులో ప్రసంగించి మోదీ అందరినీ ఉత్సాహపరిచారు. "దేశం అభివృద్ధి చెందితేనే తెలంగాణ కూడా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో భాజపాకు ప్రజల మద్దతు పెరిగింది. రాష్ట్ర అభివృద్ధి కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. మూడు రోజుల్లో తెలంగాణకు రావడం ఇది రెండోసారి. రాష్ట్రంలో భాజపా పెరుగుతోంది.. కాంగ్రెస్, భారాస తగ్గుతున్నాయి. రానున్న ఎన్నికల్లో మా పార్టీకి దేశవ్యాప్తంగా 400లకు పైగా సీట్లు రావడం ఖాయం. నేను భారతమాత పూజారిని. తెలంగాణ.. ఆంగ్లేయులు, రజాకార్లతో పోరాడిన నేల. ఇక్కడి ప్రజలను భారాస దోచుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ రాష్ట్రాన్ని తన ఏటీఎంగా మార్చుకుంది. ఒక దోపిడీదారు.. మరో దోపిడీదారుపై పోరాడలేరని ప్రజలకు తెలుసు. భారాస దోపిడీపై కాంగ్రెస్ మౌనం వహిస్తోంది. తెలంగాణ డబ్బు ఇప్పుడు దిల్లీ చేరుతోంది" "కాంగ్రెస్, భారాస రెండూ మోదీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నాయి. తెలంగాణను దోచుకున్న వారిని మేం విడిచిపెట్టేది లేదు. కుటుంబ పార్టీలు దేశాన్ని దోచుకునేందుకే రాజకీయాలు చేస్తాయి. దేశంలో ఏ దోపిడీని పరిశీలించినా.. దాని వెనుక కుటుంబ పార్టీలే ఉన్నాయి. 2జీ స్పెక్ట్రమ్ కేసులో డీఎంకే పేరు బయటకు వచ్చింది. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పేరు ఉంది. ఇప్పుడు అలాంటి పార్టీల జాబితాలో భారాస చేరింది. ఆ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టులో, దిల్లీ మద్యం వ్యవహారంలో అవినీతికి పాల్పడింది" అని మోదీ ఆరోపించారు.




## తెలంగాణలో లోక్‌సభ అభ్యర్థుల ప్రకటనకు ఏఐసీసీ కసరత్తు

**తెలంగాణలో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల జాబితా మంగళవారం వెలువడే అవకాశం ఉంది. ఆదివారం రాత్రి ముంబయిలో సమావేశమైన స్క్రీనింగ్ కమిటీ.. అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. దిల్లీలో జరగనున్న కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకోనుంది.**

## 'నన్ను అక్రమంగా అరెస్టు చేశారు'.. సుప్రీంకోర్టులో కవిత పిటిషన్



దిల్లీ: దిల్లీ మద్యం కేసులో అరెస్టయిన భారాస ఎమ్మెల్సీ కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

సర్వోన్నత న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతుండగానే తనను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో విచారణ సందర్భంగా సమన్లు జారీ చేయబోమని కోర్టుకు చెప్పి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లుగా భావించి దర్యాప్తు సంస్థపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కవిత తరపు న్యాయవాది నేడు ఆన్‌లైన్‌లో పిటిషన్ దాఖలు చేశారు.

## కవిత అరెస్ట్‌పై తొలిసారి స్పందించిన మోదీ.. ఆ ఇద్దరికీ వార్నింగ్..!




జగిత్యాల: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఓడించి తెలంగాణ వికాసం కోసం బీజేపీకి ఓటు వేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జగిత్యాలలో జరిగిన విజయసంకల్ప సభలో మోదీ మాట్లాడారు. తెలంగాణలో బీజేపీకి రోజురోజుకి ఆదరణ పెరుగుతోందన్నారు. మే13న తెలంగాణ ప్రజలు చరిత్ర సృష్టిస్తారని.. వికాసం కోసం బీజేపీకి ఓటు వేయాలన్నారు. జూన్4న వచ్చే ఫలితాల్లో ఎన్డీయే 400 సీట్లు గెలవాలని ఆకాంక్షించారు.

విపక్షాల ఇండియా కూటమిలో ఐక్యత లేదన్నారు. కూటమిలో పార్టీలన్ని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నార న్నారు. ముంబయిలో జరిగిన రాహుల్ గాంధీ న్యాయ జోడో యాత్రను ప్రస్తావిస్తూ.. విపక్షాల అనైక్యత ఆసభలో కనిపించిందన్నారు. రాహుల్ గాంధీ శక్తిపై తమ పోరాటం అన్నారని.. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో జూన్ 4న తేలిపోతుందన్నారు. శక్తిని నాశనం చేయాలని విపక్ష కూటమి భావిస్తోందన్నారు. తెలంగాణ కలలను కాంగ్రెస్ నాశనం చేసిందన్నారు. కవిత అరెస్ట్‌పై మోదీ మొదటిసారి స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, అలాగే ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు.

**మహిళలే టార్గెట్‌గా..** ప్రధాని తన ప్రసంగంలో మహిళలపై ప్రసంశలు కురిపించారు. ఉమెన్ పవర్ చాలా శక్తివంతమైనదన్నారు. మహిళలంతా తమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. మహిళా శక్తిని కాంగ్రెస్ ప్రభుత్వం హేళన చేస్తోందని. మహిళలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గౌరవం లేదని విమర్శించారు.

**తెలంగాణను ఏటీఎంలా..** తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని ప్రధాని మోదీ విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే పని చేస్తోందన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి ప్రభుత్వాలేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ విచారణ చేయించడం లేదన్నారు. బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ కవర్ చేయాలని చూస్తోందని, తాము మాత్రం అవినీతి పరులను వదిలిపెట్టేది లేదని మోదీ వార్నింగ్ ఇచ్చారు.

**నన్ను తిట్టడమే వాళ్ల పని..** కాంగ్రెస్, బీఆర్ఎస్ పని తనను తిట్టడమేనని ప్రధాని మోదీ విమర్శించారు. రోజంతా మోదీని తిట్టడానికి వాళ్ల సమయం కేటాయిస్తున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధికి మోదీ గ్యారంటీ ఉందన్నారు. కుటుంబ పార్టీలను ప్రజలు దూరంగా పెట్టాలన్నారు. దేశాన్ని దోచుకోవడమే కుటుంబ పార్టీలు లక్ష్యంగా పెట్టుకున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు.

## మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళన

హైదరాబాద్, మార్చి 18: మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, విద్యార్థుల చదువు విషయంలో కనీస రూల్స్ పాటించకుండా అశ్రద్ధ హిస్తున్నారని స్టూడెంట్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజుల విషయంలో ఉన్న శ్రద్ధ.. విద్యార్థుల చదువు విషయంలో లేదని అగ్రికల్చర్ యూనివర్సిటీ ముందు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. బీఎస్సీ అగ్రికల్చర్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల పరీక్ష విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. గత కొద్ది రోజులుగా అన్నంలో పురుగులు వస్తున్నాయని చెప్తున్నా స్పందన లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన విద్యార్థులు... మల్లారెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. విద్యార్థులకు మద్దతు తెలిపేందుకు మైనం పల్లి హనుమంత్ రావు కాలేజ్‌కు వచ్చారు.



కళాశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న ఆయన.. పిల్లలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని, సత్వరమే విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660